జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 4 | మే | 2026 ◆ పేజీలు : 5

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 3, (ప్రజా జ్యోతి)** సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెంలో నీ ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



మెరిసే లైట్లు లేవు... ఎయిర్ కండిషనర్లు లేవు... ఖరీదైన కుర్చీలు, అలంకరణలు అసలే లేవు. కానీ భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో ఉన్న "బాబాయ్ హోటల్" వద్ద మాత్రం ఎప్పుడూ జన సందడి తగ్గదు. అక్కడి వేడి వేడి అన్నం, నోరూరించే కూరలు, అమ్మ చేతి వంటలను తలపించే రుచులు భోజన ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సాధారణ హోటల్‌గా మొదలైన ఈ చిన్న భోజనశాల... ఇప్పుడు భద్రాచలంలో ప్రత్యేక గుర్తింపు పొందిన బాబాయ్ హోటల్ రుచుల నిలయంగా మారింది ...

## భద్రాద్రిలో భళా...

- భద్రాచలం టౌన్, ప్రజాజ్యోతి

# బాబాయి హోటల్...

- అమ్మ చేతి వంటతో ఇక్కడ అందరూ ఫిదా...
- పెద్దల నుంచి పేదల వరకు మెచ్చిన హోటల్..
- రుచికి, శుచి కి సరికొత్త నిర్వచనం

2 లో..

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

- యోగానంద లక్ష్మీనరసింస్వామి వారికి రథోత్సవం



**భద్రాచలం టౌన్ , మే 3 , ప్రజాజ్యోతి** భద్రాచలం శ్రీ సీతారామ చ ంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ యోగానంద ల క్ష్మీన ర సింహ స్వామి వారికి ఆదివారం రథోత్సవం నిర్వహించారు. రథంను అందమైన పూలతో అలంకరించి స్వామి వారిని ఆసీనులను చేసి రామాలయం, రాజ వీధి మీదుగా తాతుగడి సెంటర్‌కు చేరుకుంది. మార్గ మధ్యంలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఏఈవో శ్రావణ్‌కుమార్, వైదిక సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రామాలయంలోని ఆదివారం సందర్భగా స్వామి వారికి ఆర్జిత సేవలో భాగంగా అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ వేదికలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీల కరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.



## మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం



**చర్ల , మే 03:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దక్షిణ బస్తర్ జిల్లా దంతేవాడాలో భద్రతా దళాలు నిర్వహించిన సర్చ్ ఆపరేషన్‌లో కీలక విజయం సాధించారు. మావోయిస్టులు దాచిపెట్టిన భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు, నిషేధిత సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.బస్తర్ విభాగంలో నక్సలైట్‌లు పెద్ద ఎత్తున లొంగిపోయిన నేపథ్యంలో వారు దాచిన డంప్‌లు మరియు ఇతర సామగ్రిని వెలికితీయడానికి భద్రతా దళాలు నిరంతర శోధన చర్యలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో దంతేవాడా జిల్లా బారసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోడ్మా గ్రామ సమీపంలోని అడవుల్లో ఈ ఆపరేషన్ చేపట్టారు. ఖచ్చితమైన గూఢచారి సమాచారంతో మే 2న ప్రారంభమైన ఈ సంయుక్త ఆపరేషన్‌లో సి ఆర్ పీ ఎఫ్ 195వ బెటాలియన్ సిబ్బంది, దంతేవాడా పోలీసులతో కలిసి పాల్గొన్నారు. సెర్చ్ సమయంలో మావోయిస్టులు దాచిపెట్టిన పేలుడు పదార్థాల భారీ నిల్వను

మిగతా 2 లో...

## ట్రైబల్ మ్యూజియం ఆకట్టుకుంది

- ఐటీడీఏ పీఓ బి. రాహుల్ సేవలను అభినందించిన కేయూ ప్రొఫెసర్లు




**భద్రాచలం, మే 3, ప్రజాజ్యోతి:** భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంలో ప్రదర్శించిన గిరిజన కళాఖండాలు, సంస్కృతి ప్రతిబింబాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ల బృందం ప్రశంసించింది. గిరిజన అభివృద్ధితో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే విధంగా మ్యూజియంను రూపకల్పన చేసిన ఐటీడీఏ పీఓ బి. రాహుల్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు మదర్ తెరిస్సా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు.ఆదివారం కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్లు నారాయణ, వెంకయ్య, బోటనీ విభాగం డాక్టర్ కరుణాకర్ రావు, డాక్టర్ ఆశీర్వాదం ట్రైబల్ మ్యూజియంను సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియంలో ప్రదర్శించిన ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు,

మిగతా 2 లో...

## మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి...)

గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన సామగ్రి: ఎలక్ట్రిక్ డెటోనేటర్లు (75), 7.62 మిమీ ఎస్ ఎల్ ఏ ఆర్ వి రౌండ్లు, 5.56 మిమీ ఇన్సాస్ రౌండ్లు, 7.62×39 మిమీ రౌండ్లు, 12 బోర్ రౌండ్లు, ఖాళీ కేసులు, .303 బ్లాంక్ కార్ట్రిడ్జ్‌లు, బి జి ఎల్ ఖాళీ కార్ట్రిడ్జ్‌లు, వివిధ రకాల ఆయుధాల రౌండ్లు, సుమారు 500 గ్రాముల పేలుడు పదార్థం, జెలటిన్ స్టిక్స్, సేఫ్టీ ఫ్యూజ్ వైర్, కమ్యూనికేషన్ పరికరాలు (డి ఏం ఆర్ , వైర్‌లెస్ సెట్‌లు), భర్మార్ తుపాకీ, బ్యాటరీలు, కెమెరా ఫ్లాష్, ఎలక్ట్రిక్ వైర్లు, యూరియా పొడి, గ్రెనేడ్ పిన్‌లు ఇతర సామగ్రి. అదనంగా నక్సలైట్ సాహిత్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ అనంతరం భద్రతా సిబ్బంది సురక్షితంగా తిరిగి వచ్చారు అని స్వాధీనం చేసిన సామగ్రిపై పంచనామా నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు అని అధికారులు అన్నారు.

## ట్రైబల్ మ్యూజియం ఆకట్టుకుంది



(మొదటి పేజీ తరువాయి...)

ఆచార వ్యవహారాలు, కళాకృతులను ఆసక్తిగా పరిశీలించారు.మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదివాసి గిరిజనుల పురాతన వస్తువులను సేకరించి, వారి జీవన విధానం, సంప్రదాయాలు భావితరాలకు తెలిసేలా మ్యూజియంలో భద్రపరచడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆహార సేకరణకు ఉపయోగించే పరికరాలు, నీటి నిల్వ కోసం ఉపయోగించే సొరకాయ బుర్రలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని తెలిపారు. ఆదివాసీలు పర్యావరణ హిత జీవన విధానాన్ని అనుసరిస్తూ ప్రకృతిని కాపాడే వస్తువులను ఉపయోగించడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, సిబ్బంది మాధవి తదితరులు పాల్గొన్నారు.

## కీరా దోస పోషకాల గని



కీరా దోస (Cucumber) 96% నీటితో నిండి ఉండి, వేసవిలో శరీరానికి చలువ, హైడ్రేషన్ (Hydration) అందిస్తుంది. ఇది బరువు తగ్గడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో విటమిన్ కె, సి, పొటాషియం మరియు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

### ››› కీరా దోసకాయ వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు:

**హైడ్రేషన్ మరియు చలువ:** 96% నీటి శాతం ఉండటం వల్ల, శరీరాన్ని డీహైడ్రేషన్ నుండి కాపాడి, వేసవిలో చలువనిస్తుంది.

**బరువు తగ్గుదల:** అతి తక్కువ కేలరీలు మరియు ఎక్కువ ఫైబర్ కలిగి ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఉత్తమమైన ఆహారం.

**జీర్ణక్రియ మెరుగుదల:** ఇందులోని పీచు పదార్థం (Fiber) మలబద్ధకాన్ని నివారిస్తుంది మరియు జీర్ణక్రియను సజావుగా సాగేలా చేస్తుంది.

**చర్మ మరియు జుట్టు ఆరోగ్యం:** కీరాలోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని రిఫ్రెష్ చేసి, మంటను (inflammation) తగ్గిస్తాయి. కళ్ల కింద వాపును తగ్గించడానికి కూడా ఇది సహాయపడుతుంది.

**రక్తపోటు నియంత్రణ:** పొటాషియం మరియు మెగ్నీషియం ఉండటం వల్ల, రక్తపోటును (Blood Pressure) తగ్గించడంలో మరియు హృదయ సంబంధ ఆరోగ్యానికి ఇది తోడ్పడుతుంది.

**మధుమేహం నిర్వహణ:** గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల, షుగర్ లెవెల్స్ ను నియంత్రణలో ఉంచడానికి సహాయపడుతుంది.

**పోషకాలు:** విటమిన్ K ఎముకల ఆరోగ్యానికి, విటమిన్ C రోగనిరోధక శక్తికి తోడ్పడతాయి.

**ముఖ్య గమనిక:** కీరాను తోలు (peel) తో సహా తినడం వల్ల ఎక్కువ పోషకాలు అందుతాయి. ఆరోగ్య నిపుణుల సలహా ప్రకారం, పరిమితంగా తీసుకోవడం ఎల్లప్పుడూ మంచిది.



**మెరిసే లైట్లు లేవు... ఎయిర్ కండిషనర్లు లేవు... ఖరీదైన కుర్చీలు, అలంకరణలు అసలే లేవు. కానీ భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో ఉన్న "బాబాయ్ హోటల్" వద్ద మాత్రం ఎప్పుడూ జన సందడి తగ్గదు. అక్కడి వేడి వేడి అన్నం, నోరూరించే కూరలు, అమ్మ చేతి వంటలను తలపించే రుచులు భోజన ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సాధారణ హోటల్‌గా మొదలైన ఈ చిన్న భోజనశాల... ఇప్పుడు భద్రాచలంలో ప్రత్యేక గుర్తింపు పొందిన బాబాయ్ హోటల్ రుచుల నిలయంగా మారింది ...**

# భద్రాద్రిలో భళా... బాబాయి హోటల్...

● భద్రాచలం టౌన్, ప్రజాజ్యోతి

- అమ్మ చేతి వంటతో ఇక్కడ అందరూ ఫిదా...
- పెద్దల నుంచి పేదల వరకు మెచ్చిన హోటల్..
- రుచికి, శుచి కి సరికొత్త నిర్వచనం

పట్టణంలో ఎవరికైనా "బాబాయ్ హోటల్ ఎక్కడ?" అని అడిగితే వెంటనే దారి చూపించేంతగా ఈ హోటల్ స్థానికుల మనసుల్లో స్థానం సంపాదించుకుంది. పెద్ద పెద్ద హోటళ్లలో కనిపించే ఆధునిక సౌకర్యాలు ఇక్కడ లేకపోయినా, ఇక్కడి భోజన రుచికి మాత్రం ప్రత్యేక అభిమానులు ఉన్నారు.హోటల్‌లో అడుగుపెట్టగానే వేడి వేడి అన్నం వాసన, వండిన కూరల సువాసనలు ఆకలిని రెట్టింపు చేస్తాయి. పప్పు, కూర, చారు, వేపుడు... ఏ వంటకం అయినా ఇంట్లో అమ్మ ప్రేమగా వండి పెట్టినట్లే అనిపిస్తుందని భోజన ప్రియులు చెబుతున్నారు. ముఖ్యంగా తక్కువ మసాలాలతో, నాణ్యమైన పదార్థాలతో తయారు చేసే వంటకాలు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తున్నాయని కస్టమర్లు పేర్కొంటున్నారు.

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హోటల్ వద్ద ఎప్పుడూ కస్టమర్ల రద్దీ కనిపిస్తూనే ఉంటుంది. ఆటో డ్రైవర్లు, ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, కుటుంబ సభ్యులతో వచ్చే భోజన ప్రియులు ఇలా అన్ని వర్గాల వారు ఇక్కడ భోజనం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఒకసారి ఇక్కడ భోజనం చేసినవారు మళ్లీ మళ్లీ రావడం ఈ హోటల్ ప్రత్యేకతగా మారింది.

అత్యంత విశేషమేమిటంటే... పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ అధికారులు కూడా భద్రాచలం వచ్చినప్పుడు ప్రత్యేకంగా బాబాయ్ హోటల్‌కు వచ్చి భోజనం చేసి వెళ్తారని స్థానికులు చెబుతున్నారు. ఖరీదైన కార్లలో వచ్చే ప్రముఖులు కూడా ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా సాధారణ ప్రజలతో కలిసి కూర్చొని భోజనం చేయడం ఇక్కడ తరచూ కనిపించే దృశ్యం.

హోటల్ యజమాని కస్టమర్లను కుటుంబ సభ్యుల్లా చూసుకోవడం కూడా ఈ హోటల్‌కు మరింత ఆదరణ తెచ్చిపెడుతోంది. "డబ్బు కంటే కస్టమర్ సంతృప్తే ముఖ్యం" అనే భావనతో వారు అందించే సేవలు భోజన ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. కాలం మారుతోంది... ఫుడ్ కల్చర్ మారుతోంది... ఫైవ్ స్టార్ హోటళ్లు పెరుగుతున్నాయి. కానీ సాధారణ వాతావరణంలో అసలైన ఇంటి రుచిని అందిస్తూ "బాబాయ్ హోటల్" మాత్రం భద్రాచలం ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. రుచికి, ఆత్మీయతకు, సరళతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.





# మేడే అమరుల స్ఫూర్తితో ఉద్యమం బలోపేతం చేయాలి

- మంద నరసింహారావు
- సీఐటీయూ ఆధ్వ ర్యంలో కార్మిక ఉత్సవ్ వారోత్సవాలకు శ్రీకారం



**కొత్తగూడెం, మే 3 ( ప్రజాజ్యోతి )** నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మంద నరసింహారావు పిలుపునిచ్చారు. మేడే అమరుల స్ఫూర్తితో కార్మికోద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా కార్మిక ఉత్సవ్ కార్యక్రమాన్ని మే 1 నుండి 7 వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ బస్తి సెంటర్‌లో వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమం, మేడే అమరుల త్యాగాల ఫలితంగా వచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కొత్త విధానాలను అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమను దోచుకునే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని కార్మిక–కర్షక ఐక్యతతో ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కూడా అండగా నిలవాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి భూక్య రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, అంబాల దుర్గమ్మ, నందిపాటి రమేష్, సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం బ్రాంచ్ నాయకులు గూగులోత్ సక్రాం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి రాజారావు, ఎమ్మెస్ ప్రకాష్,ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కే సమ్మయ్య, సిఐటి యు నాయకులు ఎన్ ఎస్ రాజు గిరి ప్రసాద్, విజయ్, మోహన్, ప్రజానాట్యమండలి కళాకారులు రాములు, రఘు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. మే 1 నుండి 7 వరకు నిర్వహించే ఈ కార్మిక ఉత్సవ్ కార్యక్రమాల్లో కార్మికులు కుటుంబాలతో సహా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మద్దతు ధరతోనే...రైతుకు భరోసా

- ఎన్నికల సమయంలో రైతుకిచ్చిన హామీల అమలేది
- ఆయిల్ పామ్ బోర్డు ఏర్పాటు చేయాలి
- రైతు సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమ కార్యచరణ చేపడతాం...
- పోతినేని సుదర్శన్ రావు.....తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు




**అశ్వారావుపేట, మే 03, ప్రజాజ్యోతి :** రైతులకు మద్దతు ధర హామీ అమలు చేయాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు డిమాండ్ చేశారు.ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయం సుందరయ్య భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంటలకు సరైన మద్దతు ధర లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. పంటవేసిన రైతుకు అకాల వర్షాలు, యూరియా కొరత కోతులు బెడద వంటి ఇబ్బందులున్న వాటిని అధికమించి పంటను పండించి మార్కెట్ కు తీసుకొస్తే కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రైతు భరోసా రైతు, బీమాపంట రుణాల మాఫీ వంటి హామీలను పూర్తిస్థాయిలో సకాలంలో అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కొబ్బరి, పసుపు బోర్డు తరహాలో ఆయిల్ ఫామ్ పంట సాగు చేస్తున్న రైతులకు ప్రత్యేకంగా ఆయిల్ ఫామ్ బోర్డు ఏర్పాటు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని, మార్కెట్ వడిదుడుకులు, ఆయిల్ రికవరీ శాతంతో సంబంధం లేకుండా పామాయిల్ టన్నుకు రూ.25వేలు స్థిరమైన ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడంలో లోపాలు ఉన్నాయని, సాగు ఖర్చులు పెరిగి రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కొక్కెరపాటి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరం సత్యనారాయణ, సిపిఐ ఎం మండల కార్యదర్శి సోడియం ప్రసాద్, నాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## యువత క్రీడలపై దృష్టి సారించాలి: సాబీర్ పాషా






**కొత్తగూడెం, మే 3 ( ప్రజాజ్యోతి )**యువత క్రీడా, సాంస్కృతిక రంగాలపై దృష్టి సారించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా సూచించారు. ప్రగతి మైదాన్‌లో స్టాలిన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి ప్రీమియర్ లీగ్–2 క్రికెట్ టోర్నమెంట్‌ను కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ గణేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. క్రమశిక్షణ, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. వేసవి ఎండల దృష్ట్యా ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, నిర్వాహకులు స్టాలిన్, జేమ్స్, అజయ్, చక్రధర్, బిట్టు, సాయి, భరత్ పాల్గొన్నారు.

## యువత హక్కుల కోసం పోరాడాలి

**కొత్తగూడెం, మే 3 ( ప్రజాజ్యోతి )** శాస్త్రీయ విద్య, ఉపాధి గ్యారంటీ కోసం యువత పోరాడాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కె. ఫహీమ్ అన్నారు. సిపిఐ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. విద్య, ఉద్యోగ అవకాశాల కోసం పోరాటం కొనసాగుతుందని పేదలకు ఉచిత విద్య, వైద్యం అందడం లేదని తెలిపారు. 18 ఏళ్లకే ఓటు హక్కు సాధనలో ఏఐవైఎఫ్ పాత్ర ఉందన్నారు. యువత ఐక్యంగా హక్కుల కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖయ్యూమ్, రౌతో సురేష్, రణధీర్, కొంచెర్ల రాకేష్, నాదీమ్, కామల్, కొయ్యడ రవి, నాగరాజు, వినయ్ కుమార్, వంశీ, సంజయ్, శ్రీకాంత్, సన్నీ, ఆశ్రఫ్, చిన్ను, దుర్గ, శివ, హుజఫా, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



## సబ్‌కలెక్టరు కార్యాయలంలో ప్రజావాణి





**భద్రాచలం టౌన్ , మే 3 , ప్రజాజ్యోతి :**భద్రాచలంలోని సబ్‌కలెక్టరు కార్యాలయంలో నేడు ప్రజావాణి నిర్వహించనున్నట్లు భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తెలిపారు. ఈ కార్యక్రమంకు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. భద్రాచలం డివిజన్‌లోని ప్రజలు భూ సమస్యల పరిష్కారం, వ్యక్తిగత సమస్యలతో పాటు డివిజన్‌లోని వివిధ రకాల సమస్యల గురించి ప్రజలు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని కోరారు. అదేవిధంగా భద్రాచలం ఐటీడీఏ కార్యాయలంలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు పీవో బి రాహుల్ తెలిపారు.

## ఇసుక తరలిస్తున్న రెండు లారీలు, జేసీబీ పట్టివేత








**బూర్గంపహాడ్, మే 3 (ప్రజా జ్యోతి ):**అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు పాల్వంచ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం మెరుపుదాడులు నిర్వహించి రెండు లారీలు, ఒక జేసీబీని పట్టుకున్నారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి... కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తీసుకువచ్చి మండల పరిధిలోని మోరంపల్లిబంజర్లో నిల్వ చేసుకుని అక్కడి నుంచి జేసీబీతో లారీలో లోడ్ చేసి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని ఒక లారీ, ఒక జేసీబీతో పాటు అశ్వాపురం నుంచి మోరంపల్లిబంజర్ వస్తున్న మరో ఇసుక లారీని పట్టుకుని బూర్గంపహాడ్ పోలీస్టేషన్లో అప్పగించారు. ఈ దాడుల్లో టాస్కోఫర్స్ ఎస్సై జలకం ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

## కార్మిక చట్టాల పరిరక్షణ కోసం పోరాడుదాం

- ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి

**టేకులపల్లి,మే03,ప్రజాజ్యోతి**అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కేటీసీ ఎల్ఎస్ఎన్ ఓబీలో ఐఎఫ్టియు ఆధ్వర్యం లో ఆదివారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఐఎ ఫ్టియు సంఘం ఏరియా నాయకుడు మాన్ సింగ్ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొక్కు సరంగపాణి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదాని అంబానీ లాంటి పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలలో సవరణలు చేస్తూ నాలుగు లేబర్ కోడులుగా తీసుకొస్తున్నారని దీనిని కార్మిక వర్గం తిప్పి కొట్టాలని కార్మిక చట్టాల పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రభుత్వం కార్మిక కోడులను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చి న నాలుగు లేబర్ కోడలు అమలను తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం అమలు చేయమాన్ని బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ ఆయన చేశారు.ఈ కార్యక్రమంలో మోహన్ యాదగిరి, వీరన్న,బద్రు, సంపత్,రత్నాచారి,భూక్య శ్రీను,బాలాజీ,మాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# నమూనా పరీక్షలతో పోటీ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించవచ్చు

- లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్ బాబు రమేష్ బాబు
- విజయవంతమైన ఎంసెట్ మోడల్ పరీక్ష




**భద్రాచలం టౌన్, మే 3, ప్రజాజ్యోతి :** నమూనా పరీక్షలలో పాల్గొనడం వల్ల పోటీ పరీక్షలలో విజయం సాధించవచ్చు అని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్ బాబు రమేష్ బాబులు స్పష్టం చేశారు. ఆదివారం లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసెట్ మోడల్ నమూనా పరీక్షకు సుమారు 75 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా నమూనా పరీక్ష పత్రాలను విడుదల చేసిన అనంతరం ప్రసాద్ బాబు రమేష్ బాబులు మాట్లాడారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఎంసెట్ నీట్ పోటీ పరీక్షలకు ముందస్తు నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం నమూనా పరీక్షలకు అనూహ్య స్పందన లభిస్తుందని సుమారు 75 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ నమూనా పరీక్షలు పాల్గొన్నారు అని తెలిపారు. నమూనా పరీక్ష పత్రాలు సైతం విజయవాడ హైదరాబాద్ వంటి కార్పొరేట్ విద్యా సంస్థలు నిర్వహించే పరీక్షలకు సమానంగా ప్రశ్న పత్రాలను తయారు చేస్తామని తెలిపారు. ఎంతో అనుభవం అర్హత కలిగిన అధ్యాపకులచే ఈ నమూనా పరీక్ష పత్రాలను సిద్ధం చేశామని అన్నారు. ఎంసెట్ పోటీ పరీక్షలకు ముందు సాధ్యమైన ఎక్కువ నమూనా పరీక్షలకు విద్యార్థులు హాజరు అవ్వాలని కోరారు. తద్వారా పరీక్ష భయంతో పాటు సమయ అనుభవం లభిస్తుందని తెలిపారు. పరీక్ష రాసిన విద్యార్థులకు ఫలితాలను సైతం వారి చరవాణి కి పంపిస్తామని తెలిపారు. ఏటు వంటి భయం ఒత్తిడికి గురికాకుండా రానున్న ఎంసెట్,నీట్ పరీక్షలకు విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణిత అధ్యాపకులు బషీర్ తో పాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్లో బ్రిలియంట్ విద్యార్థుల ప్రతిభ




**బూర్గంపహాడ్, మే 3 (ప్రజా జ్యోతి):** ప్రతిష్టాత్మక ఫేజ్ –2 మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్లో మండల పరిధిలోని సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జిల్లా స్థాయి టాప్ ర్యాంకులను సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ ఆదివారం తెలిపారు. సారపాక నుంచి జాతీయ వేదిక వరకు బ్రిలియంట్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారని వారిని ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్ హైటెక్ సిటీ శిల్పకళా వేదిక వద్ద శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్(ఎస్ఆర్ఎఫ్) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ, కొండా సురేఖ, ఎన్ఐటీ రాయపూర్ డైరెక్టర్ ఎస్వి.రమణారావు వంటి మహనీయుల చేతులమీదుగా బ్రిలియంట్ విద్యార్థులు అవార్డులు, బహుమతులు అందుకున్నారన్నారు. బీఎన్ఆర్ మాట్లాడుతూ ఒలంపియాడ్ గెలిచిన వారే ఐఐటీ, ఎన్ఐటీ, ఐఏఎస్, ఐపీఎస్ వంటి కాంపిటేటివ్ పరీక్షల్లో గెలుస్తారని... క్రమశిక్షణ, పట్టుదల, గురువుల మార్గదర్శకత్వం ఉంటే అసాధ్యమనేది ఉండదని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ వారిని అభినందించి ప్రోత్సహించారు.

## ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛే బలం

- పాత్రికేయుల హక్కుల పరిరక్షణ సమాజ బాధ్యత: సోడెం వెంకట్



**దమ్మపేట,మే. 03 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన ఇంచార్జ్, సామాజిక ఉద్యమకారుడు, న్యాయవాది సోడెం వెంకట్ ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 3న ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని జరుపుకుంటారని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛ ప్రాముఖ్యతను గుర్తించడం, పాత్రికేయుల హక్కులను రక్షించడం, వృత్తిలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులకు నివాళులు అర్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.1993లో ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించిందని, 1991లో ఆఫ్రికన్ జర్నలిస్టులు రూపొందించిన "విండ్‌హోక్ డిక్లరేషన్" వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మే 3ను ఎంపిక చేసినట్లు వివరించారు.పాత్రికేయులు ఎదుర్కొంటున్న సవాళ్లు, సెన్సార్‌షిప్, వారి స్వేచ్ఛా హక్కులపై చర్చించేందుకు ఈ రోజు ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు.యునెస్కో,ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, ప్రజాస్వామ్య పరిరక్షణలో వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో పత్రికా రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం లారీ పట్టివేత



**దమ్మపేట,మే. 03 (ప్రజాజ్యోతి):** ఆదివారం అనుమతి లేకుండా దమ్మపేట మండల పరిధిలోకి అక్రమంగా ప్రవేశించిన ఒక ఇసుక లారీని దమపేట పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు.ఈ ఘటనపై స్పందించిన దమ్మపేట ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి , ఇసుకను దమ్మపేట మండలంలోకి తీసుకువచ్చిన వారిని కూడా ముద్దాయిలుగా చేర్చి కేసును సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్.ఐ సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఇటువంటి అక్రమ ఇసుక రవాణాలో పాల్గొనే వ్యక్తులపై బైండోవర్ చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## కెఓసి పర్యటించిన డైరెక్టర్(పి. పి) కె. వెంకటేశ్వర్లు



**టేకులపల్లి,మే03,ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియా టేకులపల్లి మండలం కోయగూడెం ఓసి లలో ఆదివారం సింగరేణి డైరెక్టర్ (పి. పి. )కె.వెంకటేశ్వర్లు పర్యటించారు. ఈ సందర్భంగా వారు కేఓసి వ్యూ పాయింట్ నుంచి పని స్థలాలను సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు.ఏరియా జి.యం వి.కృష్ణయ్యను రోజువారి బొగ్గు ఉత్పత్తి,రవాణా,ఓబి బ్లాస్టింగ్,లోడింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం డైరెక్టర్ (పి.పి) కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధికమించి,బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎటువంటి ఆటంకములు కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. మైన్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని,సింగరేణి సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యస్వో టు జియం రామస్వామి,పి.ఓ కే.ఓ.సి. గోవింద రావు,జే.కే.పి.ఓ. జాకీర్ హుస్సేన్,డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సి.ఆర్.బి. ప్రసాద్ రావు, డిజియం ఐ ఈ డి ప్రభాకర్, డీజీఎం (సివిల్) రవి కుమార్, డీజీఎం(యఫ్ & ఏ) నాగలక్ష్మి కే.ఓ.సి మేనేజర్ శ్రీనివాస రావు,జే.కే మేనేజర్ పి.పుర్ణచందర్, క్వాలిటీ మేనేజర్ రామదాసు, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## భద్రాచలం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అరుణ్‌కుమార్



**భద్రాచలం, మే 3, ప్రజా జ్యోతి:** భద్రాచలం డీఎస్పీగా అరుణ్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాచలం ఎఎస్పీ విక్రాంత్ కుమార్ బదిలీపై వెళ్లడం తో ఆయన స్థానంలో అరుణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇంటిలిజెన్స్ డీఎస్పీ గా పని చేసిన అరుణ్ కుమార్ తొలుత భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించాఉరు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌కు భద్రాచలం సీఐ నాగరాజు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## పాత మిత్రులు.. కొత్త జ్ఞాపకాలు 2000–2001 బ్యాచ్ ఆత్మీయ కలయిక

- దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు గురువులకు ఘన సత్కారం



**దమ్మపేట,మే. 03 (ప్రజాజ్యోతి):** స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణం ఆదివారం పాత జ్ఞాపకాలతో కళకళలాడింది. 2000–2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు దశాబ్దాల అనంతరం ఒక్కచోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. దేశం నలుమూలలతో పాటు విదేశాల్లో స్థిరపడిన పలువురు కూడా తమ బాల్య పాఠశాల పిలుపుతో సుదూర ప్రయాణాలు చేసి ఈ వేడుకకు హాజరయ్యారు.పాఠశాల ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే బాల్యస్మృతులు ఒక్కసారిగా తళుక్కుమన్నాయి. క్లాస్‌రూములు, ఆడుకున్న మైదానం, గడిపిన క్షణాలు అన్ని మళ్లీ కళ్లముందు మెదిలాయి. ఒకరినొకరు చూసుకుంటూ హత్తుకోవడం, పాత మిత్రులను గుర్తుచేసుకుని ఆనందపడటం, నవ్వులు పూయించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా 2000–2001లో వారికి విద్యాబోధన చేసిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, స్మారక చిహ్నాలు అందజేస్తూ గురువుల పట్ల తమ కృతజ్ఞతను వ్యక్తం చేశారు. గురువులను చూసి పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ, "మా విద్యార్థులు ఈ స్థాయికి ఎదగడం మా గురువులుగా గొప్ప గర్వకారణం. మీరు ఎక్కడ ఉన్నా, ఏ స్థాయిలో ఉన్నా మన పాఠశాలను, మన విలువలను మరువకండి. కష్టపడితే అసాధ్యం అనేది ఏదీ ఉండదు" అని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని, తదుపరి తరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, మా జీవితానికి బలమైన పునాది వేసింది ఈ పాఠశాలే. గురువులు ఇచ్చిన విద్య, శిక్షణ, విలువలు మమ్మల్ని ఈ స్థాయికి తీసుకువచ్చాయి. ఈ రోజు మళ్లీ ఇక్కడికి రావడం జీవితంలో ఒక ప్రత్యేక అనుభూతి. ఇలాంటి సమ్మేళనాలు మాకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి" అని అన్నారు.కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పాత జ్ఞాపకాల పంచుకోలు, ఫోటో సెషన్‌లు నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి కోసం సహకరించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తులో కూడా తరచుగా ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని సంకల్పించారు.ఈ మహాసమ్మేళనం స్నేహబంధాలను మరింత బలపరచడమే కాకుండా గురువుల పట్ల గౌరవాన్ని మరోసారి ప్రతిబింబించింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాద్రిలో అంగరంగ వైభవంగా 'గోదావరి నది హారతి'

- పురోహితుల మంత్రోచ్చారణల మధ్య దీపోత్సవం
- రామ నామస్మరణతో మార్మోగిన గోదావరి తీరం





**భద్రాచలం టౌన్, మే 3, ప్రజాజ్యోతి:** భద్రాచలం ప్రజలు, భక్తుల ఆదరాభిమానాలతో గోదావరి మాత నది హారతి పురోహితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు రామ వజ్జల రవికుమార్ తెలిపారు. ఆదివారం పరాభవ నామ సంవత్సరం, వైశాఖ శుద్ధ విదియను పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్ర స్వామి దివ్య క్షేత్రంలోని కరకట్టపై గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నదీ హారతి కార్యక్రమం కన్నుల పండువగా సాగింది.భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం 6:30 గంటలకు ఈ వేడుక ప్రారంభమైంది. తొలుత గణపతి పూజ నిర్వహించిన పురోహితులు, అనంతరం గోదావరి హారతి విశిష్టతను భక్తులకు వివరించారు. 'జై శ్రీరామ్' ఆకృతిలో 108 ప్రమిదలతో ఏర్పాటు చేసిన దీపోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారు. పురోహితులు శ్రీరామ అష్టోత్తరం పఠిస్తుండగా, భక్తులు 'ఓం శ్రీ రామాయ నమః' అంటూ 108 సార్లు రామ నామ భజన చేశారు.ముందుగా సీతారామచంద్రస్వామి వారికి 12 సార్లు, ఆపై గోదావరి మాతకు 21 సార్లు శాస్త్రోక్తంగా హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహోత్కార్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి, గోదావరి మాత ఆశీస్సులు పొందాలని కోరారు. అనంతరం శాంతి మంత్ర పఠనం చేసి, రామాచార్యులు, తేజ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, శనగల ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం శ్రీ రాఘవేంద్ర క్లాత్ స్టోర్స్ వారు పూజా సామాగ్రిని అందజేశారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన:** హారతి కార్యక్రమానికి ముందు బూర్గంపాడు మండలం సారపాక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని విహారిక ప్రదర్శించిన క్లాసికల్ డాన్స్ భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో పురోహితులు పవన్ కుమార్ శర్మ, కారంబరీ కృష్ణ శర్మ, రామాచార్యులు, ఫణి కుమార్ శర్మ, సత్య ప్రసాద్ శర్మ, తేజ శర్మ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భద్రాద్రి కా మహారాజు సభ్యులు , పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు పాల్వంచ హర్షిక ఎంపిక

- 36వ డివిజన్‌కు చెందిన యువ క్రీడాకారిణికి అభినందనలు వెల్లువ



**పాల్వంచ, మే 03, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 36వ డివిజన్‌కు చెందిన గుండెబోయిన హర్షిక హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడం ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. చిన్న వయస్సులోనే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడం ద్వారా ఆమె ప్రతిభను మరోసారి నిరూపించుకుంది.ఈ సందర్భంగా 36వ డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి మనోహర్ రావు హర్షికను ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తూ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. హర్షిక భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాల్వంచతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.హర్షికకు శిక్షణ అందించిన కోచ్ కొనే సూరిబాబును కూడా ఈ సందర్భంగా అభినందిస్తూ, క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఆయన కృషి ప్రశంసనీయమని తెలిపారు. సరైన మార్గదర్శకత్వం, కఠోర శ్రమతోనే ఇటువంటి విజయాలు సాధ్యమవుతాయని అన్నారు.అలాగే హర్షిక ఎదుగుదలకు నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్న ఆమె తల్లిదండ్రులు గుండెబోయిన గోవర్ధన్ రావు, సంధ్యారాణిల పాత్రను కొనియాడారు. పిల్లల ప్రతిభను గుర్తించి, చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని సూచించారు.హర్షిక వంటి యువ క్రీడాకారిణులు కృషి, పట్టుదలతో రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ సమానంగా ప్రతిభ కనబరుస్తూ తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడలు, విద్య రంగాలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ యువత ప్రతిభను వెలికితీసేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, హర్షికకు కూడా అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, డివిజన్ నాయకులు బండి రఘు, పూస రవి కుమార్, బొల్లేపల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొని హర్షికకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# హిందూయిజం ఒక మతం కాదు ఓ సార్వత్రిక విశ్వాసం

- హిందూ సమ్మేళనంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ వెల్లడి





**భద్రాచలం, మే 3, ప్రజా జ్యోతి:** హిందూయిజం అనేది ఒక మతం కాదు.. ఓ సార్వత్రిక విశ్వాసం, మానవత్వం, ప్రకృతితో మమేకమైన జీవన విధానమని హిందూ సమ్మేళన ఉత్సవ కమిటీ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ వెల్లడించారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత ప్రజలు నమ్మే ధర్మం కోసం పూర్వీకులు అనేక త్యాగాలు చేసినట్లు దేశ చరిత్ర ప్రపంచానికి తెలియజేస్తోందని, ప్రాణాలు పోతున్నా శివాజీలాంటి మహాత్ములు ధర్మాన్ని తప్పలేదని గుర్తు చేశారు. మన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మహా భారతం, భగవద్గీతను చదివి అహింసను వదలాలన్నారు. గడప లోపల కులం, గడప దాటితే హిందువులం అనే నినాదంతో హిందువులందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడం ఈ సమ్మేళనం ప్రధాన లక్ష్యమన్నారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని రాబోయే తరాలకు అందించడం మనందరి బాధ్యతని తెలిపారు. అనంతరం చిన్న అరుణాచలం వ్యవస్థాపకులు శివనాగస్వామి మాట్లాడుతూ మన హిందూ మత ధర్మాలను భవిష్యత్తు తరాలకు నేర్పించాల్సిన మనదేనని, హిందూ సమ్మేళనాలు మతపరమైనవి మాత్రమే కాకుండా సామాజిక సామరస్యాన్ని, దేశభక్తిని పెంపొందించే వేదికలుగా నిలుస్తున్నాయన్నారు. కుటుంబ సమేత భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. ధర్మప్రచారంతో పాటు హిందూ సమాజాన్ని ఏకం చేయడానికి, సనాతన ధర్మం ప్రాముఖ్యతను చాటి చెప్పడానికి నిర్వహించే ఒక గొప్ప కార్యక్రమమన్నారు. తెలంగాణలో అనేక ప్రాంతాల్లో హిందూ సమ్మేళనాలు జరుగుతున్నాయని , ఈ సభలను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం హిందూ ధర్మ ప్రచారకులు అనగానందస్వామిజీ మాట్లాడుతూ సమాజంలో ఐక్యతను పెంపొందించుకోవడం, ధార్మిక విలువలను యువతకు చేరవేయడం అవసరమన్నారు. చిన్ననాటి నుంచే పిల్లలకు క్రమశిక్షణ నేర్పిస్తూ మన హిందూ ధర్మం గొప్పతనంను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనగానందస్వామి, కృష్ణచైతన్య, సూర్యకుమారి, రామవజ్జుల రవికుమార్, బీజేపీ నాయకులు కుంజా ధర్మా, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బదిలీలపై వెళుతున్న పోలీసు అధికారులకు ఘన సత్కారం

- ఏఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణ, రాములను సన్మానించిన రూరల్ ఎస్సై సురేష్, సిబ్బంది



**పాల్వంచ, మే 03, ప్రజాజ్యోతి:** బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న పోలీసు అధికారులు ఏఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ రాములులను పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో వారు చేసిన సేవలను ఈ సందర్భంగా అధికారులు కొనియాడారు. తమ విధుల్లో నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని ఎస్సై సురేష్ పేర్కొన్నారు.ఎస్సై సురేష్ మాట్లాడుతూ, పోలీసు శాఖలో బదిలీలు సహజ ప్రక్రియ అని, ఎక్కడ పనిచేసినా ఇదే సేవా భావంతో ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. పాల్వంచలో విధులు నిర్వహించిన సమయంలో చూపిన సహకారం, అంకితభావం ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు.బదిలీపై వెళుతున్న అధికారులు మాట్లాడుతూ, పాల్వంచలో పనిచేసిన అనుభవం తమకు ఎంతో మధురమైన జ్ఞాపకాలను మిగిల్చిందని, సహచర సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. తమకు ఘనంగా వీడ్కోలు పలికి సత్కరించిన ఎస్సై సురేష్‌తో పాటు పోలీసు సిబ్బందికి వారు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.